క్లుప్తంగా

అప్పుల బాధ తాళ లేక ఆత్మహత్య

ముమ్మిడివరం: ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనకు గురై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ కుమ్మరి వీధికి చెందిన ముమ్మిడివరపు వెంకన్న(40) మంగళవారం ఉదయం ఇంటి పైన రేకుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య దుర్గ, కుమారుడు వీర వెంకట దుర్గా ప్రసాద్, కూతురు జ్యోతి నాగశ్రీ, ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ఎస్‌హెచ్‌ఓ జీవీ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు


చొల్లంగి వద్ద బోల్తా పడిన ఆటో

తాళ్లరేవు: జాతీయ రహదారిలోని చొల్లంగి నాళం వారి సత్రం సమీపంలో ఆటో బోల్తాపడిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. మంగళవారం కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు కాకినాడ ఏటిమొగ గ్రామానికి చెందిన పలువురు మండల పరిధిలోని ఇంజరం గ్రామంలోని ఒక ఇంటిలో ప్రార్థన చేసేందుకు ఆటోలో వచ్చారు. అక్కడ ప్రార్థన పూర్తయిన అనంతరం తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలు కాగా స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

కడుపు నొప్పితో రెండో తరగతి విద్యార్థి మృతి


చీకురుమిల్లి ఏడు కొండలు సందీప్

కాట్రేనికోన: మండలంలో కంది కుప్ప పంచాయతీ బొజ్జావారి పేటకు ప్రాథమిక పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థి చీకురుమిల్లి ఏడుకొండలు సందీప్ కడుపు నొప్పితో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం చీకురుమిల్లి రాంబాబు కుమారుడు ఏడుకొండలు సందీప్ సోమవారం సాయంత్రం 5 గంటలకు పాఠశాల అనంతరం చిన్నారులతో ఆడుకుంటున్న సమయంలో కడుపు నొప్పి రావడంతో కుప్ప కూలిపోయాడు. స్థానికుల సహకారంతో సందీప్‌ను తల్లిదండ్రులు ముమ్మిడివరం ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మృతి చెందాడు. ఆడుతూ పాడుతూ తిరిగే కన్న బిడ్డ మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

క్రీడలతో మానసికోల్లాసం

• జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్


కోనసీమ క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

అల్లవరం: విద్యతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని జిల్లా ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇనుమడింప జేయాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో చేపట్టిన కోనసీమ క్రీడోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు పోటీ తత్వాన్ని అలవర్చుకుని క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి మానసిక ఒత్తిడిని అధిగమించడంలో క్రీడలు ఎంతోగానో ఉపయోగ పడతాయన్నారు. కోనసీమ క్రీడోత్సవాల ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చదువులు ఎంత ముఖ్యమో, ఆటలు కుడా అంతే ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పీఎస్ సురేష్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు రాపాక విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, వడ్డి సుభాషిణి, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీను, డీసీ కమిటీ చైర్మన్ దాట్ల గోపిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ సుంకర వాసు, ఎంఈఓలు కిరణ్ బాబు, ఎస్.ఏడుకొండలు, హెచ్‌ఎం జీఎస్.వెంకటరమణ, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ క్రీడోత్సవాలు ప్రారంభం


ముమ్మిడివరంలో పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శంకరరావు తదితరులు

ముమ్మిడివరం: మండలంలో కోనసీమ క్రీడోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో స్థానిక జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, ఎంజీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో క్రీడా పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శంకరరావు ప్రారంభించారు. జూనియర్ విభాగంలో 100, 200 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, మెడిసిన్ బాల్ 1కేజీ త్రో పోటీలు నిర్వహించారు. సీనియర్(హైస్కూల్) విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షెటిల్ పోటీలు,100, 400, 800 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు జరిగాయి. వాలీబాల్ పోటీలలో జెడ్పీ బాలుర, గెదిల్లంక హైస్కూళ్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. కబడ్డీలో గాడిలంక జెడ్పీ హైస్కూల్, ముమ్మిడివరం జెడ్పీ బాలికల హైస్కూళ్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎంలు బి.హనుమంతరావు, సీహెచ్ పరిమళ, పీడీలు ఎస్.రాంబాబు, ఆర్.రమాదేవి, పి.సుజాత, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో 30 ఏళ్ల జైలు

పిఠాపురం: ఇద్దరు బాలికలను వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు రుజువు కావడంతో 30 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2019లో పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువుకు చెందిన కరగపాటి వీర వెంకటసత్యనారాయణ ఇద్దరు కుమార్తెలను జగ్గయ్యచెరువుకు చెందిన భగవతి హేమంత్ కుమార్ రెండేళ్ల నుంచి ప్రేమ పేరుతో వంచించాడు. వివాహం చేసుకొంటానని చెప్పి ఒకరికి తెలియకుండా మరొకరిని మోసగించాడు. చివరకు పెళ్లి చేసుకోకుండా మోసం చేయడంతో బాధితుల తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి పిఠాపురం టౌన్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా అప్పటి డీఎస్పీ దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. కేసును పిఠాపురం సీఐ ఎ.శ్రీనువాసు ఎస్సై.మణికుమార్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ కిశోర్ సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో కాకినాడ జిల్లా జడ్జి శ్రీదేవి ముద్దాయి భగవతి హేమంత్ కుమార్‌కు పై విధంగా శిక్ష విధించారు. బాధిత బాలికలకు రూ.2 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గంటి రత్నబాబు వాదనలను వినిపించారు.

విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను గుర్తించాలి

• జేసీ నిషాంతి


క్రీడా ఉత్సవాల విజేతలతో జేసీ నిషాంతి, ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరి రామగోపాల్ తదితరులు

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు గుర్తించి ఆ దిశగా వారికి శిక్షణ ఇస్తే విశేషంగా రాణిస్తారని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన క్రీడా ఉత్సవాలను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థుల చదువులకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇచ్చి ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో క్రికెట్ విభాగం నుంచి అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ స్థానాన్ని, అమలాపురం రూరల్ మండలం బండార్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. క్రికెట్‌తో పాటు కబడ్డీ, వాలీ బాల్, ఖోఖో క్రీడలు జరిగాయి. మూడు రోజుల పాటు ఈ క్రీడా ఉత్సవాలు జరుగుతాయని డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం తెలిపారు. ఈ క్రీడా ఉత్సవాల్లో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పీఎస్ సురేష్‌కుమార్, అమలాపురం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీ హరి రామగోపాల్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు పాల్గొని క్రీడా పోటీలను వీక్షించారు.

కీచక పండితునిపై కేసు నమోదు

మందపల్లి శనైశ్వరాలయంలో భక్తురాలి పట్ల అసభ్య ప్రవర్తన

కొత్తపేట: ఒక యువతికి శనిదోష నివారణకు పూజాధికాలు అనంతరం ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పండితునిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జీ సురేంద్ర తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి మంగళవారం రాత్రి ఎస్ఐ విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ శానిటోరియం, కోలమూరు గ్రామానికి చెందిన యువతి తన వివాహం, ఉద్యోగం విషయంలో ఇబ్బందులు పడుతోంది. తనకు తెలిసిన వారి ద్వారా జంగారెడ్డిగూడెం లలితాదేవి ఆలయంలో అర్చకత్వం చేస్తున్న కొత్తపేట మండలం మందపల్లి సమీప ఏనుగులమహల్ గ్రామానికి చెందిన పండు పంతులు అనే శర్మను సంప్రదించింది. అతను జాతకం చూసి నీకు నాగదోషం ఉంది. హోమం చేయాలి అని చెప్పి మొదట గత నెల 29న జంగారెడ్డిగూడెం లలితాదేవి ఆలయానికి రమ్మన్నాడు. తరువాత కాల్ చేసి 31న రావులపాలెం దగ్గర మందపల్లి శనైశ్వరస్వామి ఆలయంలో హోమం జరిపిస్తే ఇంకా మంచి జరుగుతుందని చెప్పి అక్కడికి రమ్మన్నాడు. అతను చెప్పిన ప్రకారం 31న మధ్యాహ్నం మందపల్లి శనైశ్వర ఆలయానికి రాగా హోమం చేయించాడు.

ఆ సమయంలో ఆమె చేతులు పట్టుకుని చేయిస్తుండగా ఆమె ఇబ్బంది పడుతుంటే ఈ పూజ ఇలానే చేయించాలన్నాడు. పూజ పూర్తి అయ్యాక స్నానం చేయాలని చెప్పడంతో ఆమె స్నానం చేయడానికి బాతరూమ్‌లోకి వెళ్లగా లోనికి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. దాంతో అరచి అతనిని బయటకు తోసేసింది. షాక్‌కు గురై భయంతో తిరిగి రాజమహేంద్రవరం వెళ్లిపోయింది. అక్కడ దిశ పోలీస్‌స్టేషన్‌కు, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మొర పెట్టుకున్నా ఎవరూ సహకరించలేదు. దాంతో కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అమలాపురం టౌన్: స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానికంగా ఓ ఆర్థోపెడిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈదరపల్లికి చెందిన చవ్వాకుల శివనారాయణ (30) మంగళవారం ఉదయం మృతి చెందాడు. మూడు నెలల క్రితం శివనారాయణ మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఓ కారు డోర్ తగలడంతో ప్రమాదానికి గురై రోడ్డుపై పడ్డాడు. సరిగ్గా అదే సమయంలో ఓ వాహనం వచ్చి శివనారాయణ కాళ్లపై ఎక్కడంతో కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అప్పట్లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నాటి నుంచి చికిత్స పొందుతున్న శివనారాయణ మృతి చెందినట్లు సీఐ వీరబాబు తెలిపారు.

కొబ్బరి పరిశ్రమల స్థాపనపై అధ్యయనం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సాక్షి, అమలాపురం: కొబ్బరి ముడి సరుకు ఆధారంగా విలువ ఆధారిత పరిశ్రమలు కేరళ, తమిళనాడు మాదిరిగా స్థాపించేందుకు ఉద్యాన, పరిశ్రమల శాఖ అధికారులు అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కమిటీ సభ్యులతో నిర్వహించారు. వివిధ పరిశ్రమలకు రాయితీల కల్పన, ప్రధానమంత్రి ఉపాధి కల్పన, సింగిల్ విండో విధానంలో అనుమతుల మంజూరు, కొత్త పరిశ్రమల పాలసీ 2024-2029, క్వాయర్ పరిశ్రమలపై ఫోకస్, రోడ్ల నిర్మాణానికి సంబంధించి కొబ్బరి ఆధారిత జియో టెక్స్ మ్యాట్ల తయారీ, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపన వంటి అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొబ్బరి ముడిసరకు ఆధారంగా వర్జిన్ కోకోనట్ కొబ్బరి వాటర్ ద్వారా పౌడర్ తయారీ, కోకోపిట్ తయారీ వంటి విలువ ఆధారిత రంగాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్, సహాయకులు శివరాం ప్రసాద్, ఉద్యాన అధికారి బీవీ రమణ, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, సిడ్బి ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కేశవ వర్మ, కాయర్ బోర్డ్ ప్రతినిధి వినోద్‌కుమార్, కోకోనట్ బోర్డ్ ప్రతినిధి కుమార్ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డాబా ఇల్లు దగ్ధం

రూ.6 లక్షల ఆస్తి నష్టం


అమలాపురంలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో డాబా ఇంట్లో చెలరేగిన మంటలు

అమలాపురం టౌన్: స్థానిక ముమ్మిడివరం గేటు సెంటర్ సమీపంలో ఓ డాబా ఇంటి పై అంతస్తులో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన అగ్ని ప్రమాదంలో ఆ ఇంట్లో విలువైన వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిన ఈ ప్రమాదంలో సీలింగ్, ఏసీలు, కర్టెన్లు అంటుకొని మొత్తం గృహ సామగ్రి దగ్ధమైంది. ఆ ఇంటి యాజమాని పచ్చిమాల జోత్స్న ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి తలుపులు తీసి మెయిన్ స్విచ్ ఆన్ చేయగానే ఒక్కసారే మంటలు చెలరేగి క్షణాల్లో ఇంటిని వ్యాపించాయి. కుటుంబ సభ్యులంతా కట్టుబట్టలతో బయటపడ్డారు. ప్రమాదంలో రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్ని మాపక సిబ్బంది ప్రాథమిక అంచనా వేసింది. తక్షణమే అమలాపురం అగ్నిమాపక దళాధికారి కె.మురళీ కొండబాబు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు.

ఆధునిక వైద్యం.. పట్టణ వాసులకు వరం

• కార్పొరేటు వైద్యానికి చిరునామా 'కిమ్స్'
• కేర్ ఆస్పత్రికి ఎక్స్‌లెన్స్ అవార్డు

అమలాపురం టౌన్: అమలాపురంలోని కిమ్స్ బోధనాసుపత్రి ద్వారా ఇప్పటికే ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. ఈ వైద్య కళాశాల ద్వారా ఏటా దాదాపు వంద మంది వైద్య విద్యార్థులు అత్యుత్తమ వైద్యులుగా బయటకు వెళ్లి వైద్య వృత్తిలో విశేషంగా రాణిస్తున్నారు. గతంలో కోనసీమ కేంద్రంగా సేవలు అందించిన ఈ బోధనాసుపత్రి ఇప్పుడు అమలాపురం జిల్లా కేంద్రం అయ్యాక వైద్య సేవలను మరింత విస్తరిస్తోంది. ముఖ్యంగా కిమ్స్ ఆధ్వర్యంలో ఆయువు భరోసా, కమాండ్ సెంటరు అనే రెండు సరికొత్త ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి. ఆయువు భరోసా ద్వారా రోగులకు ప్రత్యేకంగా ఆరోగ్య సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయువు భరోసా ద్వారా సకాలంలో అన్ని రోగాలకు చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుంది. ఇక కమాండ్ సెంటర్ ద్వారా సకాలంలో వైద్యం అందించడమే కాక పాటు వైద్య ఖర్చులను తగ్గించేలా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రానుంది.

వైద్య రంగంలో అందిస్తున్న విశేష సేవలకు గాను అమలాపురంలోని కోనసీమ కేర్ జనరల్ అండ్ ఎమర్జెన్సీ ఆసుపత్రికి న్యూఢిల్లీలోని ఉయ్ కేర్ ఫౌండేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రకటించింది. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కారెం రవితేజ ఈ అవార్డును ఫౌండేషన్ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. కరోనా సమయంలో కోనసీమ కేర్ ఆసుపత్రి ద్వారా పేద ప్రజలకు సకాలంతో వైద్య సేవలు అందించి పలువురి మన్ననలు పొందారు.

పాండిచ్చేరి ఎల్జీకి ఘన స్వాగతం

మధురపూడి: పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కె. కైలాస్‌నాథన్ మంగళవారం మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు కలెక్టర్ పి. ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిషోర్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానే శ్వరరావు, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ సాదర స్వాగతం పలికారు. జిల్లాలో 3 రోజుల పర్యటనలో భాగంగా ఆయన మధురపూడి వచ్చారు. ఇక్కడి నుంచి ఆయన కొవ్వూరు వెళ్లారు. రాత్రి కొవ్వూరులోనే బసచేస్తారు. బుధవారం అక్కడి నుంచి యానాంలో జరిగే 21 యానాం పీపుల్‌కల్చర్ ఫెస్టివల్ 2025 వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తారు. ఈనెల 9 వతేదీన యానాం నుంచి మధుర పూడి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ వెళ్తారు.

అమలాపురంలో అభివృద్ధి కాంతులు

- జిల్లా కేంద్రంగా అవతరించడంతో సేవలు సులభతరం
- విస్తరిస్తున్న వ్యాపార, వాణిజ్య సముదాయాలు
- అందుబాటులోకి కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు
- రహదారుల విస్తరణతో మారనున్న రూపురేఖలు
- అముడా ఆవిర్భావంతో పట్టణానికి మహర్దశ


అమలాపురం పట్టణం వ్యూ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం రెండు న్నరేళ్ల క్రితం వరకు కోనసీమ డివిజన్ కేంద్రం. 2022వ సంవత్సరం ఏప్రిల్ 4న జిల్లాల పునర్విభజనలో భాగంగా జిల్లా కేంద్రంగా అవతరించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా నామకరణం చేసుకుంది. నాటి నుంచి పట్టణం అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు మరో 12 జిల్లా కార్యాలయాలు ఆవిర్భవించడంతో ప్రజలకు సేవలు సులభతరంగా మారాయి. గతంలో డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు పట్టణంలో ఉన్న పలు రకాల షాపింగ్ మాల్స్‌కు వినియోగదారులు ఒక మోస్తరుగా వచ్చేవారు. ఇప్పుడు పట్టణం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించాక జిల్లా కార్యాలయాలతో పాటు పెరిగిన షాపింగ్‌మాల్స్‌కు విశేష ఆదరణ లభిస్తోంది.

రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలకు దీటుగా వస్త్ర వ్యాపారం ఊపందుకోవడంతో జిల్లా ప్రజలను అమలాపురం ఇట్టే ఆకర్షిస్తోంది. దీనికి తోడు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పట్టణ వాసులకు ఉపయుక్తంగా మారింది. కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో ఎంతో మంది ఇతర ప్రాంతాలకు చెందిన వారు పట్టణానికి వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. దీనికి తోడు గత ప్రభుత్వం రూ.450 కోట్లతో 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాస్పత్రిని నిర్మించే ఏర్పాట్లు చేసింది. దీంతో ఇప్పటికే అమలాపురంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి 650 పడకల ఆస్పత్రిగా విస్తరించే మంచి రోజులు త్వరలో రానున్నాయి. పట్టణంలో దాదాపు 50 ప్రైవేటు ఆస్పత్రుల ద్వారా ప్రజలకు వైద్యం అందుతోంది. ఓ ప్రైవేటు వైద్య కళాశాలతో పాటు బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల ద్వారా వేలాది మంది విద్యార్థులు పట్టణం నుంచి వైద్యులుగా, ఇంజినీర్లుగా బయటకు వెళుతున్నారు.

మున్సిపాలిటీ పరంగా మాస్టర్ ప్లాన్ సైతం ఇటీవల కౌన్సిల్ ఆమోదం పొందడంతో పట్టణంలో 40 నుంచి 60 అడుగుల వెడల్పుతో రోడ్లు విస్తరించనున్నాయి. గత ప్రభుత్వం అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా)ను తీసుకుని వచ్చి పట్టణంతో పాటు జిల్లాలోని పలు గ్రామాలను దీని పరిధిలోకి తెచ్చింది. ప్రస్తుతం అముడా కార్యాలయం సైతం ఏర్పాటైంది. ఇకపై అముడా ద్వారా లేఅవుట్లు, భవన నిర్మాణాలు సులభతరం కానున్నాయి.

శ్రీనిధిలో అత్యవసర వైద్యసేవలు

అమలాపురం టౌన్: అమలాపురంలోని శ్రీనిధి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అన్ని వేళలా అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని రకాల వ్యాధులకు అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల ద్వారా అత్యాధునిక వైద్యం అందిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనిల్ తెలిపారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవలు సైతం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

సుజుకీ వారి బంపర్ ఆఫర్స్

అమలాపురంలోని సుజుకీ ఆథరైజ్డ్ డీలర్ కంటిపూడి సుజుకీ సంక్రాంతి సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేకమైన లక్కీ డ్రా ఆఫర్ల సౌకర్యం కల్పించింది. మొదటి బహుమతిగా మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కారు, రెండో బహుమతిగా అయిదుగురికి సుజుకీ జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైక్, మూడో బహుమతిగా 15 మందికి సుజుకీ జిక్సర్ 250 బైక్స్, నాలుగో బహుమతిగా 20 మందికి ఆపిల్ ఐ ఫోన్ (15, 128 జీబీ)ను ప్రకటించారు.

వస్త్ర రంగంలో అగ్రగామి చందన బ్రదర్స్

అమలాపురం మెయిన్ రోడ్డులో ఉన్న చందన బ్రదర్స్ వస్త్రాలయం, జ్యూయలర్స్, షాపింగ్ మాల్ ద్వారా కోనసీమ వాసులకు సరికొత్త ఆఫర్లతో ఆకర్షణీయమైన వస్త్రాలను విక్రయిస్తోంది. సంక్రాంతి సందర్భంగా చందన షాపింగ్ మాల్ మరిన్ని ఆఫర్లతో వస్త్రాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

చిట్టిబాబు కోడి పలావు రుచి చూడాల్సిందే

అమలాపురం గొల్లగూడెం బైపాస్ రోడ్డులోని కాకినాడ వారి చిట్టిబాబు కోడి పలావు సెంటరు ప్రజలకు అందుబాటు ధరలలో రుచికరమైన పలావు అందిస్తోంది. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను మరింత ఆకట్టుకుంటోంది.

కొత్త రుచులతో శ్రీకర నాన్‌విజ్ రెస్టారెంట్

అమలాపురం పట్టణంలోని ముమ్మిడివరం గేటు సెంటరు వద్ద ఇటీవల ఏర్పాటైన శ్రీకర నాన్ విజ్ రిస్టారెంట్ కొత్త రుచులను భోజన ప్రియులకు పరిచయం చేస్తోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులను ఆకట్టుకునేలా రెస్టారెంట్‌ను తీర్చిదిద్దారు.

సంతాన సాఫల్యం సులభతరం


జీన్‌టెక్ సంస్థతో సాంకేతిక ఒప్పందాలను కుదుర్చుకుంటున్న లండన్ ఐవీఎఫ్ ప్రతినిధులు

కాకినాడ క్రైం: ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. 2015లో విశాఖపట్నంలో తొలి బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు. సంతానోత్పత్తి చికిత్సలో విశేష సేవలందిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత జెనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్ టెక్నాలజీని లండన్ ఐవీఎఫ్ అందిపుచ్చుకుందన్నారు. జీనీఫెమినా, జీనీ యాండ్రో అనే అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళల్లోనూ వంధ్యత నివారణకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జీన్ టెక్, జీఎఫ్ఏ టెక్నాలజీల సాయంతో జీనీఫెమినా, జీని యాండ్రో చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యూకేలో శిక్షణ పొందిన వైద్య నిపుణులను ఈ చికిత్సల కోసం వినియోగిస్తున్నామన్నారు. పునరుత్పత్తి వైఫల్యాలను కనుగొనేందుకు చేసిన కృషికి గాను టైమ్స్ గ్రూప్ ద్వారా ఏపీ బెస్ట్ అవార్డును అందుకున్నామని చెప్పారు. జీన్‌టెక్ వ్యవస్థాపకులు, చీఫ్ సైన్స్ అధికారి డాక్టర్ అనురాధా ఉడుముడి పునరుత్పత్తి చికిత్సా విధానాలలో సాంకేతికతను జోడించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.